
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 137 వ భాగం

## సూర్య వంశం – 5; నాభాగుడు

. భగవంతుడు కనిపించాలంటే అన్నీ వదులుకోవాలి. ఆత్మార్థే పృధ్వీం త్యజేత్ అని కదా? అన్నింటికన్నా ముందు డబ్బు, దానిమీద యావ అనేవి, మనసులో గర్వం, అహంకారం అనేవి పోవాలి. ఇవి లేని నాడు అతి సులభంగా భగవద్దర్శనం అవుతుందనేది ఆత్మ సాక్షాత్కారం పొందిన అందరూ చెప్పేది. ఈ స్కంధంలో వచ్చే నాభాగుడి కథలో నాభాగుడు ఎంత అల్ప సంతోషో అనేది తెలుస్తుంది. చిన్న కథ అయినా నేర్చుకునేది కొండంత అని చూడవచ్చు.

క. నభగుఁడను మనుజపతికిని
శుభమతి నాభాగుఁ డనఁగ సుతుఁ డుదయించెం;
బ్రభులై కవి యను తలఁపున
విభజించిరి భ్రాత లతని విత్తము, నధిపా! [9-75]

నభగుడు అనే రాజుకి నాభాగుడు అనే మంచి మనసు గల కొడుకు పుట్టాడు. అయితే అతని తమ్ములు అన్నలూ (భ్రాతలు) బలంవల్ల (ప్రభులై) ఈయన ఏదో చదువుకోవడానికి పుట్టాడు (కవి అనే తలపున) ఆయనకి రావాల్సిన ఆస్తి కూడా వాళ్ళే తీసుకున్నారు. అంటే ఈయన ఏదో గురుకులం అనే చోటకి వెళ్ళాడు ఆస్తి అదీ పట్టించుకోకుండా. వీడెందుకూ పనికిరాడు అని ఆయన ఆస్తి కొట్టేసారు. రెండు విషయాలు గమనిద్దాం. ఒకటి నాభాగుడు శుభమతి. ఇలాంటి చిన్న విషయాలకి ఏడిచేవాడు కాదని పరోక్షంగా చెప్తున్నాడు. రెండోది, ఎవరికి అత్మ జ్ఞానం అవసరమో అది ఇవ్వడానికి ముందు వాళ్ళ డబ్బూ ఆస్తులూ పూర్తిగా పోతాయి. ఇది విష్ణువు ప్రహ్లాదుడితో వామనావతారంలో చెప్పడం చూసాం. "ఎవ్వనిఁ గరుణింప నిచ్చయించితి వాని యఖిల విత్తంబు నే

నపహరింతు (8-661).” అలా ఈయన డబ్బులు కాజేసారు. అయినా ఈయన బతకడానికి ఏదో విత్తం కావాలి కదా? అందువల్ల ఇంటికి వెళ్ళి అడిగాడు.

వ. అంత నాభాగుండును బ్రహ్మచారియై, తన తోడంబుట్టువులను ధనంబుల పాలడిగిన, వారలు “దండ్రి చెప్పిన క్రమంబున నిచ్చెద” మనిన నాభాగుండు తండ్రి యగు నభగు కడకుం జని, “విభాగంబు చేయు” మని పలికిన, నతం “డిందు నంగిరసులు మేధ గలవారయ్యును, సత్త్ర యాగంబు చేయుచు, నాఱవ దినంబున నర్హకర్మంబులు దోఁపక, మూఢులయ్యెదరు; వారలకు నీవు వైశ్వదేవసూక్తంబులు రెండెఱింగించినఁ, గవి యనం బ్రసిద్ధి కెక్కెదవు; దానంజేసి వారు కృతకృత్యు లై స్వర్గంబునకు బోవుచు, సత్త్రపరిశేషితంబైన ధనంబు నీకిచ్చెద” రని పలికినం దండ్రి వీడ్కొని నాభాగుండు చని, యట్ల చేసిన, నంగిరసులు సత్త్ర పరిశేషితధనంబు లతని కిచ్చి, నాకంబునకుం జని; రంత. [9-76]

ఈయన బ్రహ్మచారి, చదువుకున్నవాడు. వెళ్ళి ఇలా నాకు కూడా వాటా ఉంది కదా అని అడిగాడు. ‘తండ్రి ఎలా చెప్తే అలా చేస్తాం’ అని వాళ్ళు తప్పుకున్నారు. తండ్రి దగ్గిరకి వెళ్ళి అడిగితే ఆయన మరో విధంగా చెప్పాడు. అంగిరసులు అనేవారు ఇప్పుడు యాగం చేస్తున్నారు. తెలివైన వాళ్ళైనా ఆరో రోజుకి ఏం చేయాలో తెలియక మూఢులు అవుతారు. వాళ్ళకి నువ్వు (చదువుకున్నావు కనక) వైశ్వదేవ సూక్తాలు చెప్పగలిగితే మంచి పేరు వస్తుంది. దాంతో యాగం ఫలించి వాళ్ళు స్వర్గానికి వెళ్తూ యజ్ఞంలో మిగిలిన డబ్బులు నీకు ఇస్తారు. అలా ఈ ఆస్తుల గొడవ పైకి రాకుండా వదుల్తుంది.

నాభాగుడు కాకుండా మరొకరు అయితే ఏమౌతుంది? ఇదేమిటి, నా ఆస్తి వీళ్ళు కొట్టేస్తే తండ్రి ఇలా అంటున్నాడు, అంటే వీళ్ళందరూ ఒకటే అంటూ శపించడమో లేదా యుద్ధం చేయడమో జరగాలి కదా? కానీ ఈయన శుభమతి. డబ్బు అంటే యావ ఉన్నవాడు కాదు అని ముందే చెప్పాడు కనకా, కానీ ఈయనకి కూడా ఏదో విధంగా డబ్బు కావాలి కనకా ‘సరే ఏదో విధంగా డబ్బు వస్తే చాలు’ అనుకుని తండ్రితో అలాగే చేస్తానని చెప్పి చేసాడు కూడా. ఆ అంగిరసులు యజ్ఞంలో మిగిలిన డబ్బు ఈయనకి ఇచ్చారు. అది తీసుకుని బయల్దేరాడు. ఇప్పుడు విష్ణువు చెప్పిన ‘ఎవ్వని గరుణింప నిచ్చయించితి..” అనే రెండో విషయం జరుగుతోంది. డబ్బు మీద ఇంకా యావ ఉందా ఈయనకి?

క. అంగిరసు లిచ్చు పసిఁడికి
మంగళమతిఁ జేరు నృపుని మానిచి, యొకఁ డు
త్తుంగుఁడు, గృష్ణాంగుఁడు దగ,
ముంగల నిలుచుండి విత్తముం జేకొనియెన్. [9-77]

ఇలా అంగిరసులు ఇచ్చిన బంగారం తీసుకుని వెళ్ళే నాభాగుడు దగ్గిరకి ఒక ఎత్తైన పొడగరివాడు (ఉత్తుంగుడు), నల్లనివాడు (కృష్ణాంగుడు) వచ్చి ఆ డబ్బులు బలవంతంగా లాక్కున్నాడు. ఇలాంటి స్థితిలో మనం అయితే ఏం చేస్తాం? చేతనైనంతలో దెబ్బలాడటం లేదా డబ్బులతో పారిపోవడం అనేవి కదా? అయితే శాంత మనస్సుతో (శుభమతి కనక) నాభాగుడు ఏం చేస్తున్నాడో గమనించండి.

వ. వానింజూచి, నాభాగుండు దనకు మును లిచ్చుటం జేసి తన ధనం బని పలికిన, నమ్మహాపురుషుండు "మీ తండ్రి చెప్పిన క్రమంబ కర్తవ్యం" బనిన నాభాగుండు నభగు నడిగిన, నతండు "యజ్ఞమందిర గతం బయిన యుచ్ఛిష్టం బగు ధనంబు దొల్లి మహామునులు రుద్రున కిచ్చి; రది కారణంబుగా నా దేవుండు సర్వధనంబునకు నర్హుం" డనిన విని, వచ్చి, నాభాగుండు మహాదేవునకు నమస్కరించి, "దేవా! యీ ధనంబు నీ యధీనం బని మా తండ్రి చెప్పె; నే నపరాధంబు చేసితి; సహింపు;" మనవుడు భక్తవత్సలుండగు నమ్మహాపురుషుండు నభగు సత్యవచనంబునకు, నాభాగుని నిజంబునకు మెచ్చి, "నీవు దప్పక పలికితివి కావున, సత్త్రపరిశేషితం బగు ధనంబు నీకు నిచ్చితి" నని పలికి యంతర్ధర్మిత్వంబును సనాతనం బగు బ్రహ్మజ్ఞానంబు నుపదేశించి, తిరోహితుండయ్యె; ఇవ్విధంబున. [9-78]

"అయ్యా ఈ ధనం నాకు అంగిరసులు ఇచ్చారు, అందువల్ల ఇది నాదే" అని చెప్పాడు. అయితే 'నీ తండ్రి దగ్గిరకి వెళ్ళి అడిగిరా' ఈ డబ్బు ఎవరిదో అన్నాడు ఆ పెద్దాయన. మరోసారి తండ్రి దగ్గిరకి వచ్చి ఇలా ఆ నల్లాయన లాక్కున్నాడు డబ్బులు అని చెప్తే తండ్రి ఏమంటున్నాడో చూడండి. తండ్రి మొదట అంగిరసులు ఇస్తారు నీకు అన్నాడు; నిజమే కానీ యజ్ఞంలో మొదటగా ఆహ్వానించేది రుద్రుణ్ణి. ఆయనతో మొదలుపెట్టకపోతే యజ్ఞం సఫలం కాదు. ఈ విషయం మనం దక్ష ప్రజాపతి చేసిన యజ్ఞం లో చూసాం. రుద్రుడికి భాగంలేనిది యజ్ఞమే అవదు. అందువల్ల "అవును నిజమే, యజ్ఞంలో ఉచ్ఛిష్టమైనవన్నీ డబ్బుతోపాటు మొదట రుద్రుడికి ఇచ్చారు; నీ దగ్గిర్నుంచి డబ్బులు లాగేసుకున్న ఆ పెద్దాయన రుద్రుడు కనక ఆయనకే చెందుతుంది ఈ ధనం అంతా."

మరోసారి ఆలోచిద్దాం. మన తండ్రే ఇలా అంటే మనం ఏం చేస్తాం? ఇదేమిటి మొదట్లో అన్నదమ్ములు నా ఆస్తి పంచేసుకుంటే ఈయన చూస్తూ ఊరుకున్నాడు. ఆ తర్వాత అంగిరసులు ఇస్తార్లే అన్నాడు. వాళ్ళు ఇచ్చింది తీసుకుంటే ఇప్పుడు అది రుద్రుడిది, నీకేం లేదు ఫో అంటున్నాడు. ఈయనా ఒక తండ్రే? ఎంత మోసం చేసాడు అనుకుంటాం కదా? కానీ నాభాగుడు మనలాంటివాడు కాదు. బతకడానికి కావాల్సిన కొంచెం డబ్బు కోసం ధర్మం తప్పే మనిషికాదు; తండ్రినీ తోడబుట్టువులనీ అసహ్యించుకునే వాడూ కాదు. అందువల్ల వెనక్కి వచ్చి రుద్రుడితో చెప్పాడు, “మా తండ్రి ఈ డబ్బునీదే అని చెప్పాడు; తప్పు చేసినందుకు సహించి నన్ను క్షమించాలి.”

ఇదే నాభాగుడికి భగవంతుడు పెట్టిన పరీక్ష. డబ్బు అంటే యావ ఉందా? మిగతావార్నిఎలా చూస్తాడు డబ్బులు కొట్టేస్తే? ఇవన్నీ చూసాక ఇప్పుడు తాను సత్యం, ధర్మం తప్పని వాడిననీ, బ్రహ్మ జ్ఞానం తీసుకోవడానికి అర్హుణ్ణి అని నిరూపించుకున్నాడు. అందుకు రుద్రుడు మెచ్చుకుని చెప్తున్నాడు, “నువ్వు సత్య, ధర్మ మార్గం తప్పలేదు కనక ఈ ధనం నీదే.” దానితో బాటు ఆత్మని తనలో దర్శించగలిగేదీ (అంతర్దర్శిత్వంబు) అతి ప్రాచీనమైనదీ (సనాతనం), ఏది సంపాదిస్తే ఇంకేమీ సంపాదించనక్కర్లేదో అటువంటి బ్రహ్మజ్ఞానం ఎలా పొందాలో చెప్పి వెళ్ళాడు. అలా నాభాగుడు భగవంతుణ్ణి చేరుకున్నాడు. ఈ నాభాగుడి కొడుకే అంబరీషుడు.

క. భువిలో నాభాగునికథ
దవిలి మతిన్ రేపు మాపుఁ దలఁచినమాత్రం
గవి యగు; మంత్రజ్ఞుం డగుఁ;
బ్రవిమలగతిఁ బొందు నరుఁడు భద్రాత్మకుఁడై. [9-79]

ఇంత చిన్న కథ చదివినందుకు మంత్రసిద్ధి, సిద్ధి కలిగి ముక్తి పొందుతాడు అంటున్నాడు శుకమహర్షి. ఎలా చదివితే? శ్రద్ధగా (తవిలి మతిన్) రేపుమాపు (పొద్దున్నా సాయంత్రం). ఎందుకయ్యా ఇన్నిసార్లు అంటే ఈ కథ చదువుతూ మననం చేసుకుంటూ ఉంటే వస్తువుల మీదా, ధనం మీదా యావ తగ్గుతూ, భగవంతుడే తప్ప ఇంకేమీ అక్కర్లేదనే స్థితి చేరుకుంటాం. అలా ఓ రోజుకి ఈ జన్మలోనో మరో జన్మలోనో సిద్ధి కలిగే అవకాశం ఉంది.

ఇక్కడనుంచి నాభాగుడుకి పుట్టిన కొడుకు విషయం అంబరీషోపాఖ్యానంగా వస్తుంది. ఈ అంబరీషోపాఖ్యానం (భాగవతంలో రసగుళికలు - 6, 7, 8) అంతకుముందు చెప్పుకున్నాం కనక అది వదిలేసి ముందుకి సాగుదాం. మనువుకి ఇక్ష్వాకుడనే అయన పుట్టాడు సూర్యవంశంలో ముఖ్యమైన రాజు ఈయన. ఈయన పేరు మీదే రాముణ్ణి "ఇక్ష్వాకు కులా తిలకా" అనేది. ఈయనకి పుట్టిన కొడుకులూ వాళ్ళూ ఏం చేసారు, ఎక్కడ రాజ్యం చేసారనేవి ఒక్కోటిగా వస్తాయి ఇక్కడ నుంచి.

సీ. ఇక్ష్వాకునకుఁ బుత్రు లెలమిఁ బుట్టిరి నూర్వు
రమర వికుక్షియు నిమియు దండ
కుండు నాతని పెద్దకొడుకులు మువ్వు రా
ర్యావర్త మందు హిమాచలంబు
వింధ్యాద్రిమధ్య ముర్వీమండలము గొంత
యేలిరి యిరువదియేవు రొక్క
పొందున నా తూర్పుభూమి పాలించిరి
యందఱు పడమటి కధిపులైరి [9-156]

తే. యున్ననలువది యేడ్వురు నుత్త రోర్వి
దక్షిణోర్వియుఁ గాచిరి తండ్రి యంత
నష్టకాశ్రాద్ధ మొనరింతు ననుచు నగ్ర
సుతు వికుక్షి నిరీక్షించి శుద్ధమైన
మాంసఖండంబు దెమ్మనె మహితయశుఁడు. [9-156.1]

పెద్ద కొడుకులు ముగ్గురు – వికుక్షి, నిమి, దండకుడు అనేవారు. కొంతమంది దక్షిణంగా ఉన్న దేశం, మరికొంత మంది ఉత్తరంగా ఉన్న దేశం పాలించారు. 'అష్టకా శ్రాద్ధం చేయాలి పరిశుద్ధమైన మాంసం తీసుకురా' అని పెద్ద కొడుకుని ఆదేశించాడు ఇక్ష్వాకుడు. సాధారణంగా సీస పద్యం తర్వాత వచ్చే ఎత్తుగీతి [ఆటవెలది లేదా తేటగీతి] నాలుగు పాదాలతో ఉంటుంది కానీ పైన తేటగీతిలో అయిదు పాదాలు గమనించారా?

మ. అగుఁగా కంచు వికుక్షి వేఁటజని ఘోరారణ్యభూమిం దగన్
మృగసంఘంబులఁ జంపి బిట్టలసి తా; మే నొల్లఁబో నాకటన్
సగమై యొక్క శశంబుఁ బట్టి తిని శేషంబైన మాంసంబు శీ
ఘ్రగతిం దండ్రికిఁ దెచ్చి యిచ్చె నకలంకస్ఫూర్తి వర్ధిల్లగాన్. [9-157]

అలాగే అంటూ (అగుగాక అంచు) వికుక్షి వేటకి వెళ్ళి అనేక జంతువులని వేటాడి అలసిపోయి ఆకలికి తట్టుకోలేక ఒక కుందేలుని చంపి తిన్నాడు. తినగా మిగిలిన మాంసం 'ఇదే పరిశుద్ధమైనది' అని పట్టుకొచ్చి తండ్రికి ఇచ్చాడు. ఈ పద్యంలో కుందేలు అనేది ఎక్కడుంది? శశంబు అంటే కుందేలు. అయితే పరిశుద్ధమైనది అనేదో? అకలంక – నిష్కళంకమైనది. ఇలా అబద్ధాలు ఆడి పట్టుకొస్తే ఏమౌతుందనేది వచ్చే వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS